Eenadu

19/09/18



**మెట్రో రైలు సికింద్రాబాద్ ఈస్ట్ స్టేషన్‌కు.. దూర ప్రాంత ప్రయాణికుల నుంచి క్రమంగా ఆదరణ పెరుగుతోంది. తాము వెళ్లబోయే రైలును అందుకోవాలంటే మెట్రోనే ఉత్తమం అని భావిస్తున్నారు. నిత్యం ట్రాఫిక్ జామ్‌లు ఉండే నగరంలో సమయానికి రైలును చేరుకోవాలంటే మెట్రోతోనే సాధ్యమనే నిర్ణయానికొచ్చారు. ఇటీవల ఒకే రోజు అత్యధికంగా 14,120 మంది ఈ స్టేషన్‌లో దిగారు. ఎక్కినవారు 6,166 మంది ఉన్నారు. మొత్తంగా ఒకరోజులో రికార్డు స్థాయిలో 20 వేల మందికి పైగా రాకపోకలు సాగించారు. అమీర్‌పేట ఇంటర్ ఛేంజ్ మెట్రో స్టేషన్ తర్వాత ఒక రోజులో అత్యధిక రాకపోకలు సాగించిన మెట్రో స్టేషన్ సికింద్రాబాద్ ఈస్ట్ కావడం విశేషం.**

ఈనాడు, హైదరాబాద్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి నిత్యం లక్షన్నర మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారే ఎక్కువగా రైళ్లను ఆశ్రయిస్తుంటారు. వీరిని దృష్టిలో పెట్టుకునే మెట్రో కారిడార్-3లో రైల్వే స్టేషన్‌కు అనుసంధానంగా తూర్పు వైపు ఉప్పల్ బస్టాపు వద్ద సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్‌ను నిర్మించారు. ఆరంభంలో సరైన ప్రచారం, అవగాహన లేక రైల్వే ప్రయాణికులు మెట్రోను పెద్దగా వినియోగించేవారు కాదు. ఇప్పుడిప్పుడే రైలు దిగిన ప్రయాణికులు, రైలులో ప్రయాణించాల్సిన వారు మెట్రోని ఎంచుకుంటున్నారు.



# రైలెక్కి వస్తాం..
# రైలెక్కే వెళ్తాం

- దూరప్రాంత ప్రయాణికులకు అనువు
- సికింద్రాబాద్ మెట్రో స్టేషన్‌కు ఆదరణ

## దిగేవారే ఎక్కువ..

రోజు మొత్తం చూస్తే ఉదయం పూట రైలు దిగేవారు, సాయంత్రం వేళ రైలు ఎక్కాల్సిన వారి శాతం అధికంగా ఉంటుంది. రైలు దిగిన తర్వాత బస్సు, మెట్రో, వ్యక్తిగత వాహనాలు, ఆటో, క్యాబ్ సేవలను ప్రయాణికులను వినియోగించుకుంటున్నారు. రైలు ఎక్కాల్సిన వారు వీటినే వినియోగిస్తున్నా.. సమయానికి రైల్వే స్టేషన్‌కు చేరకపోతే రైలు చేజారే అవకాశం ఉంది కాబట్టి మెట్రోకి ప్రాధాన్యం ఇస్తున్నారు. బస్సు, ఆటో, క్యాబ్, వ్యక్తిగత వాహనం ఏదైనా ట్రాఫిక్ రద్దీ దృష్ట్యా చాలా ముందే ఇంటి నుంచి బయలుదేరాల్సి ఉంటుంది. మెట్రోలో అయితే అనుకున్న సమయానికి కొద్దిగా ముందుగా బయలుదేరితే చాలని దీన్ని ఆశ్రయిస్తున్నారు. గత గురువారం వినాయక చవితి రావడంతో వారాంతపు సెలవులు కలిసి వస్తాయని చాలామంది పండగ ముందు బుధవారం రాత్రి దూర ప్రాంతాలకు రైలు టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. వీరిలో ఎక్కువ మంది మెట్రో వైపే మొగ్గు చూపినట్లు ఆ రోజు మెట్రో ప్రయాణికుల రికార్డులు చెబుతున్నాయి. సాధారణ రోజుల్లో మియాపూర్, జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీలోని ఒక్కో మెట్రో స్టేషన్‌లో ఆరేడు వేల మంది మెట్రో ఎక్కుతుంటారు. బుధవారం ప్రతి స్టేషన్ నుంచి 10-11 వేల మంది మెట్రోలో ప్రయాణించారు. ఉప్పల్, నాగోల్ స్టేషన్ల నుంచి మెట్రో ఎక్కినవారు పెరిగారు.

### సికింద్రాబాద్ ఈస్ట్ మెట్రో స్టేషన్ నుంచి రాకపోకలు ఇలా...

| ఎప్పుడు | ఎక్కినవారు | దిగినవారు |
|---|---|---|
| సెప్టెంబరు 12 | 6166 | 14240 |
| సెప్టెంబరు 11 | 5589 | 7946 |
| సెప్టెంబరు 5 | 5819 | 6605 |
| సెప్టెంబరు 4 | 5843 | 6505 |
| ఆగస్టు 27 | 7779 | 7112 |
| ఆగస్టు 26 | 7760 | 8695 |
| ఆగస్టు 20 | 7023 | 7459 |
| ఆగస్టు 19 | 5761 | 6410 |
| ఆగస్టు 16 | 5881 | 6991 |
| ఆగస్టు 9 | 5526 | 6437 |





## స్కైవాక్స్ వస్తే..

రైల్వే స్టేషన్ నుంచి మెట్రో స్టేషన్‌కు నేరుగా చేరుకునేందుకు స్కైవాక్స్ లేకపోవడంతో లగేజీతో రహదారి మీదుగా అటుఇటు చేరుకోవడం ప్రయాణికులకు అంత సౌకర్యంగా లేదు. దీంతో చాలామంది ప్రైవేటు వాహనాల వైపే మొగ్గు చూపుతున్నారు. ఇవైతే నేరుగా రైల్వే స్టేషన్ లోపలి వరకు లగేజీని తీసుకొచ్చే వెలుసుబాటు ఉంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు స్కైవాక్స్‌ను, విమానాశ్రయంలో మాదిరి ట్రాలీబ్యాగ్స్ తీసుకెళ్లేలా సదుపాయాలు కల్పిస్తామనే హామీలు ఆచరణలోకి రాలేదు. స్కైవాక్స్ వస్తే మెట్రో స్టేషన్ నుంచి కిందకు దిగాల్సిన పనిలేకుండా నేరుగా రైల్వే స్టేషన్‌కు చేరుకోవచ్చు. వీటిని త్వరగా అందుబాటులోకి తీసుకొస్తే ప్రయాణికుల సంఖ్య రోజువారీగా ఇప్పటికంటే కొన్నిరెట్లు అధికంగా పెరిగే అవకాశం ఉంది.